ప్రజాశక్తి

సోమవారం 2 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఈ దగా భరించలేం!



- తగ్గించిన ధర పునరుద్ధరించాల్సిందే
- కదలివస్తున్న పాల రైతులు
- నేడు విశాఖ డెయిరీ ముట్టడి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

తగ్గించిన ఆవుపాల ధర పునరుద్ధరించాలని రైతు న్యాయమైన విన్నపం విశాఖ డెయిరీ యాజమాన్యం చెవికి చేరినట్లులేదు. పాల రైతుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ముందుకురావడంలేదు. మొద్దుబారి నిద్రపోతున్న విశాఖ డెయిరీ యాజమాన్య నిద్రమత్తు వదిలించేందుకు పాల రైతులు సోమవారం విశాఖ డెయిరీకి కదిలివస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం (ఎఐకెఎస్ అనుబంధం) పిలుపుతో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పాల రైతులు ఉదయం 10.30 గంటలకు డెయిరీని ముట్టడించనున్నారు. రైతు నుంచి సేకరించిన ఆవు పాలు లీటర్‌కు రూ.మూడు తగ్గించి కోట్ల రూపాయలు యాజమాన్యం తమ జేబులో వేసుకోవాలని చూస్తోంది. పాల ధర తగ్గించడంతో అదనంగా ఏడాదికి రూ.64.80 కోట్లు మిగలనుంది. తగ్గించిన పాల ధరను అక్టోబర్ 16 నుంచి డెయిరీ యాజమాన్యం అమలుచేస్తోంది. అప్పటి నుంచి పాలరైతులు పాత ధర పునరుద్ధరించి చెల్లించాలని, డెయిరీ సరఫరా చేస్తున్న పెంచిన పశువుల దాణా ధర తగ్గించాలని అక్టోబర్ 29న డెయిరీ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. పాల కేంద్రాల వద్ద రైతులు నిరసనలు కొనసాగుతున్నాయి.

విశాఖ డెయిరీకి ఉమ్మడి ఐదు జిల్లాల నుంచి దాదాపు 2.50 లక్షల మందికిపైగా ప్రతిరోజూ ఆరు లక్షల లీటర్ల ఆవుపాలు పోస్తున్నారు. ఆవు పాల ధర లీటర్‌కు రూ.3 తగ్గించడంతో రోజుకు రూ.18 లక్షలు చొప్పున ఏడాదికి రూ.64.80 కోట్లు యాజమాన్యానికి మిగులుతుంది. రైతు నుంచి సేకరించిన ఆవు పాలకు రూ.3 తగ్గించిన యాజమాన్యం, వినియోగదారులకు విక్రయిస్తున్న ధరలో పైసా తగ్గించలేదు. ప్రస్తుతం లీటర్ ఆవు పాలకు 3.5 వెన్నశాతంపై రూ.34 రూపాయలు చెల్లిస్తున్నట్లు పాల రైతులు చెబుతున్నారు. ప్రాసెసింగ్ చేసి వినియోగదారునికి లీటర్ పాలు రూ.54కు డెయిరీ అమ్ముతోంది. పాలు ప్రాసెసింగ్, నిర్వహణ ఖర్చులకు రూ.10 పోనూ, మిగిలిన రూ.10 ప్రోత్సాహకంగా చెల్లించాలని పాల రైతు డిమాండ్ చేస్తున్నారు. కానీ యాజమాన్యం ప్రోత్సాహించకపోగా, చెల్లిస్తున్న ధరలో ఆవు పాలకు రూ.3

మిగతా 2లో..

పాల రైతుకు పాత ధర చెల్లించాలి

ఆవు పాల ధర పునరుద్ధరించి రైతుకు చెల్లించాలి. విశాఖ డెయిరీ సరఫరా చేస్తున్న దాణా ధర తగ్గించాలి. ఏడాదికి రెండుసార్లు పాల రైతుకు బోనస్ చెల్లించాలి. మిగులులో లీటర్‌కు రూ.10 చొప్పున ప్రోత్సాహం కింద ఇవ్వాలి. పాడి పశువుల వాస్తవ ధర ఆధారంగా ఇన్స్యూరెన్స్ రైతుకు చెల్లించాలి.

కర్రి అప్పారావు,
ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు



విశాఖ బీచ్ రోడ్డులో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పలుచోట్ల ఎయిడ్స్ డే ర్యాలీలు

వార్తలు 8లో..

జివిఎంసిలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో, అన్ని జోనల్ కార్యాలయాలలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించనున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి తెలిపారు. నగరంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవెన్యూ, యుసిడి, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన సమస్యలపై నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చని పేర్కొన్నారు.

విశాఖ బాలోత్సవం న్యాయ నిర్ణేతలకు సత్కారం

వార్త 2లో..

రుషికొండ భవనాలను సద్వినియోగం చేయండి

వార్త 4లో..

మానసిక వైద్యంలో నూతన పోకడలు

వార్త 8లో..

కబడ్డీని ప్రోత్సహిస్తాం

-మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వార్త 8లో..

ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో



క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ముగింపులో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యాన ఎంవిపి.కాలనీలోని గాది రాజు ప్యాలస్ వేదికగా నిర్వహిస్తున్న క్రెడాయ్ 10వ ప్రాపర్టీ ఎక్స్‌పో ఆదివారం సాయంత్రం ముగిసింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత హాజరై మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో విశాఖపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అనకాపల్లి జిల్లాలో 15 ఎకరాల్లో బల్క్ డ్రగ్‌పార్క్, మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి సంస్థలు రావడానికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖ తోపాటు ఇతర జిల్లాల పోలీసు కేంద్రాల్లో భూ అక్రమాలపై ప్రత్యేక సెల్ ఏర్పాటు ఏర్పాటుచేస్తామని, తద్వారా భూ కబ్జాలు, ఇతర ఆక్రమణదారులపై బాధితులు స్వేచ్ఛగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గంజాయి నివారణకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. డ్రోన్లు వినియోగించి గంజాయిని నిర్మూలిస్తున్నామన్నారు. అనంతరం ప్రాపర్టీ ఎక్స్ పో లక్కీ డ్రా ద్వారా గెలుపొందిన విజేతలకు బహుమతులు, బిఆర్ మెమోరియల్ అవార్డులను ఆర్కిటెక్చర్ విద్యార్థులకు ప్రదానం చేశారు. అనంతరం క్రెడాయ్ విశాఖ చాప్టర్ అధ్యక్షుడు వి.ధర్మేందర్ మాట్లాడుతూ, ఎక్స్‌పోను విజయవంతం చేసిన వారికి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, చైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు (సాయి), ఎక్స్ పో కన్వీనర్ సిహెచ్ గోవిందరాజు, గౌరవ కార్యదర్శి వి.శ్రీను, వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణం



- ఎపి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు తొలివిడతగా రూ. 2 కోట్లు చెల్లింపు
- ప్రజాశక్తితో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్ వెంకటరావు



ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం మహారాణి పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలంలో నాలుగు అంతస్తులతో నూతన భవనం నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని, దీని నిర్మాణానికి తొలి విడతగా రూ.2 కోట్లు చెల్లించామని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్ వెంకటరావు తెలిపారు. తనను కలిసిన ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ భవన నిర్మాణం ఎంతవరకు వచ్చింది?

ఇంతవరకు ప్రయివేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న మహారాణిపేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలం తమ ఆధీనంలోకి వచ్చింది. త్వరలోనే అక్కడ నాలుగు అంతస్తులతో అతిపెద్ద భవనం నిర్మాణం కానుంది. ఎపి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు తొలివిడతగా రూ.2 కోట్లు చెల్లించాం.

భవనం నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుంది?

ఏడాది క్రితం నాలుగు అంతస్తులు భవనం నిర్మాణానికి రూ.25 కోట్లు కావచ్చని అంచనా వేశారు. ఈ ఏడాది మార్చి నెలలో రూ.2 కోట్లు చెల్లించాం. నిర్మాణం ప్రారంభం కాలేదు. అంచనా విలువ పెరగవచ్చు.

అంతా భారీ స్థాయి భవన నిర్మాణానికి అవసరమైన నిధులు ఉన్నాయా?

స్థానిక సంస్థల

మిగతా 2లో..

విశాఖ బాలోత్సవం న్యాయ నిర్ణేతలకు సత్కారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్లో గత నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగిన విశాఖ బాలోత్సవంలో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన వారిని ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సత్కరించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్ర యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ హెడ్ ఎ.నరసింహారావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ హాజరై, న్యాయనిర్ణేతలను సత్కరించారు. సభ ప్రారంభంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం ఇన్‌ఛార్జి, విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ, విజ్ఞాన కేంద్రం ఏర్పాటు వెనుకనున్న లక్ష్యాల గురించి, కేంద్రం కార్యకలాపాల గురించి వివరించారు. పిల్లల్లో వైజ్ఞానిక ఆసక్తిని కళా తృష్ణను వెలికి తీయడానికి, వారిలో సమానత్వం, సహకారం పెంపొందించేందుకోసం గత రెండేళ్లగా విశాఖ బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది దిగ్విజయవంతంగా జరగడానికి అన్ని విధాలా సహకరిస్తున్న న్యాయ నిర్ణేతలకు ధన్యవాదాలు తెలియజేశారు. గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఈ సంవత్సరం జరిగిన విశాఖ బాలోత్సవంలో 120 స్కూళ్లకు చెందిన 8 వేలమంది పిల్లలు, 84 ఈవెంట్లలో పాల్గొన్నారని, ఎంతో క్రమశిక్షణతో ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయని, ఇందుకు న్యాయ నిర్ణేతలు అందించిన సహకారం విలువైనదని చెబుతూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ముఖ్య అతిథి నరసింహారావు మాట్లాడుతూ, ఈనాడు పిల్లలు బాల్యాన్ని కోల్పోతున్నారని, తమ సమయమంతా చదువుకే కేటాయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. తల్లిదండ్రులు కూడా ఎక్కువగా ఒత్తిడి చేస్తున్నారని, వారికి ఆటలు, పాటలతో గడిపే సమయం ఉండటం లేదన్నారు. ఇటువంటి సమయంలో విశాఖ బాలోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతైనా హర్షించదగిన విషయం అన్నారు.



న్యాయనిర్ణేతలను సత్కరిస్తున్న ఎంవిఎస్.శర్మ తదితరులు

మొదటి పేజీ తరువాయి..

ఈ దగా భరించలేం!

తగ్గించడంతో పాల రైతు నష్టపోతున్నాడు. తమ రెక్కల కష్టాన్ని యాజమాన్యం రెండుచేతులా దోచుకుతింటోందని పాల రైతు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. విశాఖ డెయిరీ పాల ధరను పెంచడంతో ఇతర డెయిరీలు ధరలు పెంచాయి. అవుపాల ధర విశాఖ డెయిరీ తగ్గించడంతో అమూల్ ఆవు పాల ధరను తగ్గించింది. ఆవు పాలు కనిష్ఠ ధర రూ.38.75 నుంచి రూ.32కు, గరిష్ఠ ధర రూ.49 నుంచి రూ.42కు తగ్గించినట్లు రైతులు చెబుతున్నారు. ఈ రెండు డెయిరీలు ధర తగ్గించడంతో హెరిటేజ్ కూడా పాల ధర తగ్గిస్తుందన్న ప్రచారం జరుగుతోంది. విశాఖ డెయిరీ యాజమాన్య నిర్ణయంతో పాల రైతు నష్టపోతున్నాడు.

త్వరలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణం

నుంచి, ముఖ్యంగా జివిఎంసి నుంచి భారీ మొత్తంలో సెస్సు సొమ్ము జమ కావలసి ఉంది. అది జమ అయితే, భవన నిర్మాణానికి అవసరమైన పూర్తి నిధులు అందిస్తాం. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం జరగాల్సి ఉంది.

జిల్లాలో ఎన్ని ప్రభుత్వ గ్రంథాలయాలు ఉన్నాయి?

ఉమ్మడి విశాఖ జిల్లాలో జిల్లా గ్రంథాలయంతో పాటు, పలు మండలాలలో మొత్తం 64 బ్రాంచి గ్రంథాలయాలు ఉన్నాయి. 63 బుక్ డిపాజిట్ సెంటర్లు ఉన్నాయి.

బ్రాంచి గ్రంథాలయాలు అన్నింటికీ సొంతభవనాలు ఉన్నాయా?

విశాఖలో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థకు సొంత భవనం లేదు. అద్దె భవనంలో నడుస్తోంది. ఇందుకోసం ప్రతి నెల రూ.44 వేలు అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని బ్రాంచి గ్రంథాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి. అనకాపల్లి పట్టణంలో ఉన్న బ్రాంచి గ్రంథాలయానికి స్థలం ఉన్నప్పటికీ, చాలాకాలం భవనం లేని పరిస్థితి ఉండేది. అక్కడ కూడా సొంతభవన నిర్మాణం ఎంపీ నిధులతో శరవేగంగా జరుగుతోంది.

అన్నిచోట్ల అవసరమైన ఉద్యోగులు ఉన్నారా?

శాఖా గ్రంథాలయాలు, బుక్ డిపోల నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా 130 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం 63 మంది మాత్రమే ఉన్నారు. ఖాళీల వివరాలను ప్రభుత్వానికి పంపించాం.

గ్రంథాలయాలకు పుస్తకాలు సరఫరా ఎలా ఉంది?

ప్రతి ఏటా కొత్త పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలు అన్ని గ్రంథాలయాలకు వస్తున్నాయి. నెల రోజుల క్రితం ఇందుకోసం రూ.54 వేలు వచ్చాయి.

గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహణకు ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చాయా?

రాలేదు. అయినప్పటికీ జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించాం.

జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారా?

ప్రత్యేకంగా లేదు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న మాదిరిగానే జరిపాం. గత ఏడాది జిల్లా గ్రంథాలయ సంస్థకు పాలకవర్గం ఉండేది. వారి ఆధ్వర్యాన జరిగింది. ఇప్పుడు పాలకవర్గం లేదు.

గ్రంథాలయాలకు ఆదరణ తగ్గిందా?

ఆదరణ తగ్గలేదు. పాఠకులు బాగా వస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం పెరిగింది. ఇది మంచి పరిణామం.

సిబ్బంది జీతాలు బకాయి ఉందా?

బకాయిలు లేకుండా ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. పెన్షనర్లకు కూడా బకాయిలు లేకుండా చెల్లింపులు చేస్తున్నాం.

3న జాబ్ మేళా

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యాన కంచరపాలెంలోని ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫీస్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో సైఫ్ ఆటోమాటిన్స్ సర్వీసెస్, కాడమస్ సొల్యూషన్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, క్యూ కనెక్ట్, పేటీమ్ కంపెనీలు పాల్గొంటాయని తెలియజేశారు. 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లమో, బి.టెక్ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులందరూ హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన వారు విశాఖపట్నం, హైదరాబాద్, తమిళనాడులలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9948768778 సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలియజేసారు. ఆధార్, ఆధార్ లింక్డ్ మొబైల్‌తో హాజరై స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవాలని పేర్కొన్నారు.

చిల్లర నాణేల పంపిణీ



కంచరపాలెం రైతు బజార్‌లో చిల్లర పంపిణీ చేస్తున్న కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రైతు బజారుకు వచ్చే వినియోగదారులకు, రైతులకు చిల్లర కొరతను తీర్చేందుకు కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ కంచరపాలెం శాఖ ఆధ్వర్యాన కంచరపాలెం రైతు బజార్‌లో చిల్లర నాణేలను ఆదివారం పంపిణీచేశారు. బ్యాంక్ అధికారులు, సిబ్బంది కలిసి వినియోగదారులకు రూ.5, రూ.2, రూ.1 నాణేలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ దిలీప్ మాట్లాడుతూ, ప్రస్తుతం మార్కెట్లో చిల్లర కొరత అధికంగా ఉందని, దానిని కొంత తగ్గించేందుకు తమ బ్యాంకు చిల్లర పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. తమ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు విశేష సేవలు అందిస్తున్నామని, డిపాజిట్లపై అధిక వడ్డీలు, తక్కువ వడ్డీకి రుణ సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఈ చిల్లర పంపిణీ ఎంతో ఉపయోగకరంగా ఉందని బ్యాంకు అధికారులకు రైతులు, వినియోగదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీతమ్మధార శాఖ మేనేజర్ కె.విశ్వనాథం, కంచరపాలెం శాఖ అసిస్టెంట్ మేనేజర్ వి.చందన, ఇతర సిబ్బంది, రైతు బజార్ సిబ్బంది పాల్గొన్నారు.

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రెడీమేడ్ వస్త్రాలు విరివిగా అందుబాటులోకి రావడంతో, టైలర్లకు పనులు లేకుండా పోయాయని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీనిని గుర్తించి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ విశాఖ జిల్లా టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆదివారం దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. టైలర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారికి ప్రభుత్వం నుంచి సహాయం చేయాలని, 50 ఏళ్ల దాటిన టైలర్లకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు, కూనూరు మల్లికేశ్వరరావు, అధ్యక్షులు అతికినిశెట్టి సత్యనారాయణ, న్యాయ సలహాదారులు తెలగారెడ్డి పుల్లయ్య నాయుడు, జిల్లా టైలర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ జిల్లా కన్వీనర్ గెద్దం గంగరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాస్కరరావు, ఉపాధ్యక్షులు ఇమంది త్రినాథ్, కోన రమేష్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

6న కేన్సర్ నియంత్రణ వ్యాక్సిన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ పిరీన్ రహమాన్ సహకారంతో ఈ నెల 6న జర్నలిస్టుల కుటుంబాల్లో 8 నుంచి 18 ఏళ్ల లోపు ఆడపిల్లలకు కేన్సర్ నియంత్రణ వ్యాక్సిన్‌ను ఉచిత శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నాయకులు తెలిపారు. 6వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వన్ టౌన్ ఓల్డ్ బస్టాండ్ కోటవీధి సమీపంలోని మత్స్యకార కమ్యూనిటీ హాల్లో వ్యాక్సిన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9849147350 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఐఎస్ఎస్ విశ్వకర్మలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటిఎం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారత తూర్పు నౌకాదళ కమాండ్ ఐఎన్ఎస్ విశ్వకర్మలో మొట్టమొదటి సారిగా బ్యాంక్ ఆఫ్ బరోడా అత్యాధునికమైన పోర్టా క్యాబిన్ ఎటిఎమ్‌ను ఆదివారం ఐఎన్ఎస్ విశ్వకర్మ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ పంకజ్ శర్మ సమక్షంలో రియర్ అడ్మిరల్ ఎం.ఎం.ఎం.రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం రీజియన్ రీజనల్ మేనేజర్ పి.ఎం.పఠాన్, నేవీ సిబ్బంది, డిఫెన్స్ బ్యాంకింగ్ వర్టికల్, రీజనల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటిఎమ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

కేబుల్ స్టార్ స్కాలర్‌షిప్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రికల్, వైర్, కేబుల్ తయారీదారు ఆర్ఆర్ కేబుల్ విశాఖపట్నంలో కేబుల్ స్టార్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ -2024 విజేతలను వెల్లడించింది. నగరంలోని విఐపి రోడ్డు సమీపంలోని హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్ఆర్ గ్లోబల్ డైరెక్టర్ కీర్తి కాబ్రా విజేతలను ప్రకటించి మాట్లాడారు. స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన ఎలక్ట్రీషియన్‌ల పిల్లల కోసం రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఏటా రూ.1 కోటి కంటే ఎక్కువ నిధులను ప్రతిభావంతులైన విద్యార్థులకు కేటాయించినట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా, ఇప్పటి వరకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున వ్యక్తిగత స్కాలర్‌షిప్‌లను అందుకోవడానికి 3000 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 1000 మంది స్కాలర్‌షిప్ విజేతలలో 54 మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కాలర్‌షిప్ విజేతలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అందని వేతనాలతో అవస్థలు!

- ఐదు నెలలుగా జీతాల్లేని స్కూల్ శానిటేషన్ వర్కర్స్
- పనిభారంతో పరేషాన్ : పట్టించుకోని అధికారులు



వేతనాలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్స్ (ఫైల్)

ప్రజాశక్తి -భీమునిపట్నం : అరకొర వేతనాలు, అవీ ఐదు నెలలుగా వేతనాలు అందక పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ అవస్థలు పడుతున్నారు. జీతాల్లేక కుటుంబపోషణ ఇబ్బందికరంగా మారడం ఒక సమస్య అయితే, మరోవైపు చాలీచాలనంత మందితో పనిచేయడం వల్ల పనిభారంతో పరేషాన్ అవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. దీనిపై అధికారులు, నేతలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, ఆందోళనలు చేసినా పట్టడం లేదని వాపోతున్నారు.

భీమిలి మండలంతోపాటు జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 93 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతోపాటు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తంగా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు 8,120 మంది విద్యార్థులు న్నారు. ప్రతి 300 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున 101 మంది శానిటేషన్ వర్కర్స్‌ను చొప్పున 2021 ఫిబ్రవరిలో నియమించారు. పాఠశాల లను, మరుగు దొడ్లను పరిశుభ్రంగా ఉంచడం వీరి బాధ్యత. ఇందుకోసం ఏడాదికి రెండుసార్లు కెమికల్స్, ఒకసారి గ్లౌజులు, మాస్క్‌లు, పైపర్, చెత్త బుట్టలు, బకెట్, మగ్గ తదితరాలను ప్రభుత్వం అందజేస్తుంది. ఏడాది పొడుగునా ఇవే వస్తువుల ను ఉపయోగించుకునే పరిస్థితి.

గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి సాయంలో ఒక్కొక్కరి నుంచి రూ.వెయ్యి, రూ.రెండు వేలు చొప్పున మినహాయించి, వీరికి నెలకు రూ.ఆరు వేలు వేతనం చెల్లించారు. అప్పటి నుంచి అరకొర వేతనాలతో జీవితాలను వెళ్లదీస్తున్నారు. ఇపుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విద్యాసంవత్సరంలో గడచిన ఐదునెలలుగా వీరికి వేతనాలను చెల్లించడం లేదని వాపోతున్నారు.

పని భారం ఎక్కువ

ప్రతి 300 మంది విద్యార్థులకు ఒక శానిటేషన్ వర్కర్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రతి వంద మందికి ఒక వర్కర్ ఉంటే తమపై పనిభారం తగ్గుతుందని వీరు అంటున్నారు. దీంతో పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ ఇబ్బందికరం, భారంగా ఉందని వీరు ఆవేదన చెందుతున్నారు. అన్నింటినీ సహించి పనులు చేస్తున్నా, సక్రమంగా వేతనాలు చెల్లించక ఇబ్బందులకు గురిచేయడం సరికాదని వాపోతున్నారు

వేతనాలు అందక కుటుంబపోషణ భారం

జూలై నుంచి ఐదు నెలల వేతనాలు ఇంకా అందలేదని స్కూల్ శానిటేషన్ వర్కర్స్ వాపోతున్నారు. నెలకు ఇచ్చే రూ 6 వేలతో జీవనం కష్టమౌతుంది. ఇచ్చే అరకొర వేతనమైనా సకాలంలో చెల్లించకపోవడం ఏంటని వీరు అంటున్నారు. పెరుగుతున్న నిత్యావసరాలు, ఇతర వస్తువులతో కుటుంబపోషణ భారమౌతున్న పరిస్థితుల్లో, తాము సక్రమంగా పనిచేస్తున్నా, సరిగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి, వేతన బకాయి చెల్లించాలని, ఇతర సౌకర్యాలను కల్పించాలని వీరు వేడుకుంటున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం.



సకాలంలో వేతనాలు అందక చాలా ఇబ్బందులు పడు తున్నాం. నెలకు ఇచ్చే రూ.6 వేలు కూడా బకాయి పెడితే ఎలా? ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, నెలవారీ వేతనాలు తమ బ్యాంక్ ఖాతాలో జమ చేయాలి.ఐదు నెలల బకాయి చెల్లించాలి

జె సన్యాసమ్మ, శానిటేషన్ వర్కర్, కుమ్మరిపాలెం

బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి



గత ప్రభుత్వం అమ్మఒడి లబ్ధిదారుల నుంచి నెలకు రూ.వెయ్యి, రూ.రెండు వేలు చొప్పున కోత పెట్టి శానిటేషన్ వర్కర్లకు వేతనాలు ఇచ్చేది. ఇపుడు ఐదు నెలల బకాయి ఉంది. కూటమి ప్రభుత్వం నేరుగా వర్కర్ల బ్యాంక్ ఖాతాలకు సకాలంలో వేతనాలు జమ చేయాలి

జి.మంగశ్రీ, విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)

అరకొర వేతనమైనా అందడం లేదు..



ఎంతో కాలంగా పని చేస్తున్నప్పటికీ తమ వేతనాలు గొర్రె తోక బెత్తెడు చందాన నెలకు రూ.6వేలు దాటడం లేదు. వాటి చెల్లింపులోనూ బకాయిలే. పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు లేవు. ఏడాదికి ఒకసారి ఇచ్చే బకెట్లు, మగ్గ, పైపర్ ఏ మూలకు చాలవు.

పొడుగు బంగారమ్మ, శానిటేషన్ వర్కర్, కొండపేట .

నేరాలు ఘోరాలు

20 మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని భీమన్నదొరపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు సీఐ చింతా వాసునాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ గంట్యాడ సంతోష్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈశ్వరరావు అనే వ్యక్తి నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనపరచుకున్నారు ఆయనను విచారించగా, వివిధ దుకాణాల నుంచి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి, వాటిని అమ్ముకోవడం ద్వారా జీవనోపాధి పొందుతున్నట్లు చెప్పాడు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితునిపై కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ ఛార్జీలు పెంచడం దుర్మార్గం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- పెందుర్తి : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగల్లో తొక్కి, విద్యుత్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం పెంచడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే ఆదీప్‌రాజ్ అన్నారు. ఆదివారం రాంపురంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు అబద్ధాల మాటలు చెప్పి గెలవడం చంద్రబాబుకు అలవాటేనని అన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచేదిలేదంటూ మాటిచ్చి, ఇపుడు భారీ పెంపుతో వినియోగదారులను మోసపుచ్చారన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. స్థానిక వైసిపినాయకులు పాల్గొన్నారు

అకాల వర్షం... అపార నష్టం

- పంట చేతికొచ్చే దశలో ఫెంగల్ కలవరం
- వరిచేను, ధాన్యం రక్షణకు రైతన్నల అగచాట్లు
- నాణ్యత చెడిపోతుందేమోనని గుబులు

ప్రజాశక్తి-ఆనందపురం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరిపంట చేతికి అందొచ్చే దశలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వర్షాలు, ఈదురుగాలులు వీస్తుండంతో నష్టం తప్పదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిపైర్లపై చినుకులు పడడం, ఆవెంటనే గాలివీయడంతో పొలాల్లో పరుపులా వరిచేను పడిపోయిందని, దీంతో కంకులు విరిగిపోవడంతోపాటు, గింజలు నేలరాలి తీవ్రనష్టం జరుగుతుందని రైతులు కంటతడి పెడుతున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు అనుకూలంగా ఉండడంతో వరిపైర్లు సాగు ఆశాజనకంగా ఉంది. ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో వరి సాధారణ విస్తీర్ణం 11,232 ఎకరాలైతే, పదివేల పైచిలుకు ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. ఆనందపురం మండలంలో 656 హెక్టార్లకుగాను ఇంకా 403 హెక్టార్లు వరిపైరు కోతకు సిద్ధంగా ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. మండలంలో బోని, శిర్లపాలెం, ముచ్చర్ల, పేకేరు ముకుందపురం,గొట్టుపల్లి, కుసులవాడ, పొడుగుపాలెం, చందక, ఆనందపురం బీపీ కల్లాలు తదితర గ్రామాలలో వరి పంట ఎక్కువగా సాగుచేశారు. దాదాపు పంట చివరి దశకు చేరడం, పైర్లు ఆశాజనకంగాఉండడంతో మంచి దిగుబడులతో లాభాలు వస్తాయని రైతులు సంబరపడ్డారు. అకాలంగా వచ్చి ఫెంగల్ తుఫానుతో చేతికి వచ్చిన పంట, నోటిక అందకుండా పోతుందేమోనని రైతులు కలవరపడుతున్నారు.

పలు గ్రామాల్లో వరికోతలు జరగ్గా, చేను తడిసిపోకుండా ఆదరాబాదరగా పొలాల్లోనే కుప్పలుగా వేశారు. యంత్రాల సాయంతో కోసిన చేనును, నూర్పిడి పట్టిన ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు కప్పి



గాలివానకు నేలకొరిగిన వరి చేను

ఉంచారు. అయితే మూడునాలుగు రోజులుగా మబ్బుల వాతావరణంలో ధాన్యం టార్పాలిన్లు కిందనే ఉండిపోవడంతో రంగు మారి, నాణ్యత చెడిపోతుందేమోనని రైతన్నలు గుబులు చెందుతున్నారు., పొడుగుపాలెం, చందక, బోని గొట్టపల్లి తదితర గ్రామాల్లో కోసిన పొలాల్లోనే వరిచేనును గాలి దిబ్బలు పెట్టినప్పటికీ కుప్పల కిందకి నీరు చేరడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వరిపొలాల్లో కోసిన వరి పనల నుంచి ధాన్య రాలిపోకుండా ఉండాలంటే నీటిలో కలిపిన గల్ల ఉప్పు ద్రావణాన్ని వరి పనలపై పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి సిహెచ్.సంధ్యరత్నప్రభ సూచించారు. మరోరోజు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిక రైతులను కలవరానికి గురిచేస్తోంది, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి, వరిపైర్లు, ధాన్యం రక్షణకు సూచనలు చేస్తున్నా, రైతుల్లో ఆందోళన వీడడం లేదు.

ముగిసిన ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్‌పి హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోకొద్ది నెలలుగా జరుగుతున్న ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ తరగతులు ముగిసాయి. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటాన మోహనరావు అధ్వర్యంలో ఏటా మాదిరిగానే ఈఏడాది కూడా శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలని, ఈనెల 8వ తేదీన జరుగు పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను టీచర్ గొట్టిపల్లి సత్యనారాయణ వివరించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, జి చిన్నయ్య, శివ కుమార్ పాల్గొన్నారు

గణపతినగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ గజిబిజి!

- ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలకు ఇక్కట్లు
- ట్రాఫిక్ నియంత్రణకు కానరాని చర్యలు
- అమలుకు నోచుకోని రహదారి విస్తరణ

ప్రజాశక్తి-గోపాలపట్నం :జివిఎంసి 89వ వార్డు గణపతినగర్ జంక్షన్‌లో నిత్యం విపరీతమైన రద్దీ కారణంగా తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయి. కొత్తపాలెం అండర్‌పాత్ మార్గం నుంచి నాగేంద్రనగర్‌నగర్‌కాలనీ, భగత్‌సింగ్‌నగర్, చంద్రనగర్, యల్లపువానిపాలెం, కోటనరవ, పెదనరవ, తదితర ప్రాంతాలకు ఈ మార్గం ద్వారానే ప్రజలు రాకపోకలు సాగించాలి. పెరిగిన జనాభాకు అనుకూలంగా రహదారులు లేవు. ఇదే మార్గంలో చిల్లర వర్తకులు, తోపుడుబళ్ల వ్యాపారులు రహదారిని ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనికి తోడు వైన్‌షాపు ఇక్కడే ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యంగా మారాయి. దీంతో ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

త్వరలో రోడ్డు విస్తరణ

గణపతినగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యను స్థానిక ఎమ్మెల్యే గణబాబు దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా త్వరలోనే రోడ్డు విస్తరణ



రద్దీగా ఉన్న గణపతినగర్ జంక్షన్

పనులు ప్రారంభిస్తామని, ఇప్పటికే అధికారులతో ప్రణాళిక సిద్ధచేశామని హామీ ఇచ్చారన్నారు. కూటిమి ప్రభుత్వం అధికారలోనికి వచ్చి నెలలు గడుస్తున్నప్పటికీ పనుల్లో కదలిక లేకపోవడంతో స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణ శూన్యం

గణపతినగర్ జంక్షన్‌లో పదేపదే పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతున్నప్పటికీ, వాటిని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ కనిపించరు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల సమయాల్లో తప్ప, ఈ సెంటర్‌లోని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు మాత్రం కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో ట్రాఫిక్‌కు ఇక్కట్లు లేకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడంతోపాటు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి, ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం చూపాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

గురజాడకు ఘననివాళి



గాజువాకలో గురజాడకు నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జోన్, శీలానగర్ ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు వర్ధంతిని శీలానగర్‌లో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి ఐద్వా నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, మహాకవి గురజాడ అప్పారావు జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయక మన్నారు. వరకట్న వేధింపులు, బాల్యవివాహాలకు ప్రతిఒక్కరూ తోడ్పడాలని, బాగాచదువుకొని, సమాజ మార్పుకు తోడ్పాటు నందించడం ద్వారా గురజాడ అప్పారావు ఆశయసాధనకు కృషి చేద్దామన్నారు కార్యక్రమంలో ఐద్వానేతలు జి.మణి, ఎస్. నాగవేణి, డి శ్రీదేవి, బేబీ, మానస, సునీత, లక్ష్మి పాల్గొన్నారు.

మాధవధార : గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం కంచరపాలెంలో బొట్టా నర్సింగరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ పెంటకోట రామారావు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ముందుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి కవులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఆర్.తిరుపతిరావు, షణ్ముఖరావు, అడబాల సత్యనారాయణ, భాస్కరరావు, సానబోయిన అప్పలరాజు పాల్గొన్నారు.

ఆంజనేయులుకు ఆత్మీయ సత్కారం



మానం ఆంజనేయులను సత్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం :నాలుగు దశాబ్దాలకుపైగా విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్‌కు విశిష్ట సేవలందించిన బ్యాంక్ పూర్వ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులుకు ఆదివారం ఆత్మీయ సత్కారం లభించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ శాఖోపశాఖలుగా విస్తరించడంలోనూ, సహకార బ్యాంకుల అభివృద్ధికి మానం ఆంజనేయులు చేసిన కృషి అభినందనీయమని న్యాయవాది ఎవి.లెనిన్ కొనియాడారు. సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు జి.ఆనంద్, పి.దుర్గారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వార్డులో పర్యటన చేస్తున్న నరసింహపాత్రుడు.

ప్రజాశక్తి -గాజువాక : వార్డు పరిధిలోని సమస్యలను గుర్తించి, వాటిని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కారానికి కృషి చేస్తానని జివిఎంసి 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు ఆదివారం వార్డు పరిధిలోని సంజీవికాలనీ, భవానీనగర్ తదితర ప్రాంతాల్లో కూటమి నేతలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులోని పెండింగ్ సమస్యల పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో చిన్న, కర్రి కృష్ణ, నాగేశ్వరరావు, కామేశ్వరరావు, కె రాజేశ్, గండి అప్పలరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, స్పార్టన్స్ యూత్ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ డెయిరీని ప్రభుత్వమే నిర్వహించాలి

● కొనసాగిన కార్మికుల దీక్షలు



దీక్షల్లో మాట్లాడుతున్న యూనియన్ నేత రమణ

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీని ప్రభుత్వ ఆధీనంలోనే నడవాలని, విశాఖ కోఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ, యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక రిలే నిరాహార దీక్షలు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, డెయిరీలో విధులు నిర్వహించ రాదన్నారు. ఎనిమిది గంటల పనిదినం అమలుతో పాటు, అదనపు గంటల పనికి ఓటి ఇవ్వాలని, మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు.. కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, పని ప్రదేశాల్లో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని,. దీనికి యాజమాన్యానిదే పూర్తి బాధ్యత అని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ నారాయణ, సంతోష్, వెంకటరమణ, గవర వెంకటరమణ, శంకరరావు పాల్గొన్నారు.

12వ వార్డులో టిడిపి సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వవార్డు పెదగదిలి కొండవాలు ప్రాంతంలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు బూత్ కన్వీనర్ దువ్వి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. టిడిపి సానుభూతి పరులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వచ్చి సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గాడి సత్యం, పాల్తేరి శేషగిరి, నక్కిన శివ, గజ్జి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ భవనాలను సద్వినియోగం చేయండి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

ప్రజాశక్తి- సీతమ్మధార : వందల కోట్ల ప్రజాధనంతో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రుషికొండ ప్యాలెస్ భవనాలను సద్వినియోగపరిచే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కమిటీని ఏర్పాటుచేసి, వారి సూచనలను స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆ భవనాలను అలాగే నిరుపయోగంగా వదిలేయడం వల్ల నిర్వహణ వ్యయం భారమవ్వడమే కాకుండా పాడయ్యే ప్రమాదం ఉందని, తద్వారా లాభం కంటే నష్టమే ఎక్కువని అభిప్రాయపడ్డారు. ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నరవ ప్రకాశరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆచార్య బాలమోహనదాస్, సామాజికవేత్త సన్ మూర్తి, శివశంకర్, ఆచార్య ముత్యాలరావు వింటాక్ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రుషికొండ ప్యాలెస్ ఖర్చుల భారం ప్రభుత్వంపై పడకుండా విడివిడిగా ఆయా భవంతులను వివిధ కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. సామాజిక విశ్లేషకులు సన్ మూర్తి మాట్లాడుతూ ఒకటి రెండు భవనాలను టూరిజం వసతిగృహంగా, మరో రెండు భవనాలను చిత్ర పరిశ్రమ షూటింగులకు, ఇంకో రెండు భవనాలను పురావస్తు భద్రతా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మిగిలిన మరో భవనాన్ని విఐపిలకు అతిథి కేంద్రంగా మార్చాలని సూచించారు. రుషికొండ భవనాలను మ్యూజియంగా మార్చాలని వివిధ బౌద్ధ సంఘాల ప్రతినిధులు వెంకటరమణ, కస్తూరి ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జయశ్రీ, హుస్సేన్, హ్యూమన్ రైట్స్ శ్యాంప్రసాద్, డాక్టర్ బాబ్జి, శీతల్, చిన్నారావు, మేడా మస్తాన్ రెడ్డి, తెలుగు భాష ప్రతినిధి మూర్తి పాల్గొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల అభిప్రాయాలు, నిర్ణయాలను ప్రభుత్వానికి పంపుతామని కన్వీనర్ నరవ ప్రకాశరావు వెల్లడించారు.

ఘనంగా గంటా జన్మదిన వేడుకలు



గంటాకు శుభాకాంక్షలు చెబుతున్న జెడ్‌పిటిసి వెంకటప్పడు, నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను విశాఖ ఎంవిపి కాలనీలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం, జిల్లాలోని వివిధప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబసభ్యులు, అభిమానుల సమక్షంలో గంటా శ్రీనివాసరావు కేకు కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. జన్మదిన శుభాకాంక్షలు స్వీకరించారు. పెద్ద సంఖ్య లో శని వారం కలిసి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. గంటా శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, సర్పంచ్ జివి.నారాయణ, పార్టీ మండల అధ్యక్షులు డిఎవి.రాజు, నాయకులు గోరే చంద్ర మౌళి, సదానంద, పాసి నరసింగరావు, త్రినాథ్ కుమార్, కారి అప్పారావు, మజ్జి వెంకటరావు ఉన్నారు.

మెగా రక్తదాన, వైద్యశిబిరాలు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మ దినం సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలోఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరంతోపాటు దంత, సాధారణ వైద్య శిబిరాలను గంటా తనయుడు రవి తేజ ప్రారంభించారు. రక్తదాతలు, వైద్య శిబిరాల నిర్వాహకులను అభినందించారు. రోగులకుఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పద్మనాభం : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి టిడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం విశాఖలోని గంటా నివాసానికి వెళ్లి.జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత . మండల అధ్యక్షులు కెవి సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు, టిడిపి మండల అధ్యక్షులు కె.రమణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కె.లీలావతి. పద్మనాభం ఎంపిటిసి కె.లక్ష్మీనాయుడు, కె.సుమంత్‌నాయుడుః లక్ష్మీ నాయుడు. కే సుమంత్ నాయుడు. తదితరులు వెళ్లారు. పువ్వులు బోకేలు అన్ని అబినందించారు.


అనకాపల్లి : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర ఆదివారం విశాఖలోని ఆయన స్వగృహంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట జివిఎంసి 82, 83 వార్డుల ఇన్చార్జులు పోలవరపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, ఆకుల నానాజీ, వేగి కృష్ణ, బిటి కుమార్, భాను చంద్ర, జొన్నాడ సురేష్ ఉన్నారు.

నక్కపల్లి: భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను గంటా అభిమాని మీగడ సత్తిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు అద్దూరి లోవరాజు, కెవి సత్యనారాయణ, కోసూరి నాని బాబు, దేవవరపు లోవరాజు, అల్లాడ రాము, కొప్పిశెట్టి వీరబాబు, నాగేశ్వరరావు, కోసూరి శ్రీను, కర్రి సుబ్బా రావు, బంగారి రాజు అయ్యప్ప, కర్రి దుర్గ పాల్గొన్నారు.

కశింకోట : భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు కసింకోట గ్రామంలో ఆదివారం నిర్వహించారు. తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు నైనము శెట్టి రామణారావు, తాకాశి కృష్ణ, సిదిరెడ్డి శ్రీను, బలిజ ముసలి నాయుడు, కర్రి దుర్గనాయుడు, అందే సన్యాసి రావు, మాజీ ఎంపిటిసి అద్దెపల్లి బాబురావు పాల్గొన్నారు.

చోడవరం : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా చోడవరం టిడిపి కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జి వెంకట సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డేటి నాగ గంగాధర్, న్యాయవాది చీపురుపల్లి సూర్యనారాయణ, ఎంపిటిసి నాయుడు, శివాలయం కమిటీ చైర్మన్ జి సురేష్, సకురు కోటేశ్వరరావు, నేమాలహరి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు టిడిపి మండల నాయకులు ఆదివారం విశాఖపట్నంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ ఎంపిపి ఎంవివి.సత్యనారాయణ, కొండపాలెం సర్పంచ్ ముచ్చకర్ల తాతయ్యలు ఉన్నారు.



గంటాను గజమాలతో సత్కరిస్తున్న బుచ్చయ్యపేట నేతలు

తాగూర్ ప్రమాద బాధిత కుటుంబాలకు

ద్రోహం చేసిన కార్మికశాఖ మంత్రి

- మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

పరవాడ ఫార్మాసిటీలోని ఠాగూర్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించడంలో కార్మిక శాఖ మంత్రి ద్రోహం చేశారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు పేర్కొన్నారు. తక్షణమే మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ ఠాగూర్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారని, 30 మంది క్షతగాత్రులు వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రమాద మతులను పరామర్శించడానికి వచ్చిన రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ మృతుల కుటుంబాలకు కేవలం రూ.40 లక్షల మాత్రమే పరిహారంగా ప్రకటించి చేతులు దులుపుకొని వెళ్లిపోవడాన్ని ఖండించారు. ఆగస్టు నెలలో అచ్చుతాపురం ఎసెన్షియ ఫార్మాలోను, పరవాడ సినర్జిన్ కంపెనీలో జరిగిన ప్రమాద మృతులకు స్వయంగా ముఖ్యమంత్రి కోటి రూపాయలు పరిహారంగా ప్రకటించి, క్షతగాత్రులకు రూ.50 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు అందించారని, కాని ఠాగూర్ ప్రమాదంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి కార్మికులకు ద్రోహం చేయడం దారుణమన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రాథమిక నివేదిక ఆధారంగా ఈ ప్రమాదం యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే జరిగిందని తెలియజేశారని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఈ ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని మృతులకు కోటి రూపాయలు పరిహారాన్ని ఇవ్వాలని, చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు. లేకుంటే బాధితులు కుటుంబాలతో పెద్ద ఎత్తున ఆందోళన దిగుతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు, చిత్రంలో శంకర్, గనిశెట్టి, శ్రీను



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అచ్చుతాపురం

నర్సీపట్నంలో ఈనెల 20, 21, 22 తేదీలలో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము అన్నారు. మహాసభ పోస్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కరించుకోగమని నమ్మి, ఆ విలువలతో రాజీలేని పోరాటం చేయడంలో ఎదురులేని పార్టీగా సిపిఎం గుర్తింపు పొందిందని చెప్పారు. అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత జరుగుతున్న ఈ మొదటి మహాసభలో ఫార్మా, ఎస్ఈజెడ్, ఎన్ఎఒబి తదితర కార్మికుల సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తుందన్నారు. ఈ మహాసభలకు ప్రజలందరూ సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే. సోమునాయుడు కర్రి అప్పారావు, కే.రామ సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న విసి ఆచార్య సూర్యప్రకాశరావు

ప్రశాంతంగా క్లాట్-25 పరీక్ష

ప్రజాశక్తి-సబ్బవరం : జాతీయ న్యాయ కళాశాలల్లో ప్రవేశానికి ఆదివారం జరిగిన కామన్ లా ఎంట్రన్స్ టెస్ట్ (క్లాట్-25) జాతీయ స్థాయి పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వావిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సూర్య ప్రకాశరావు తెలిపారు. విశాఖపట్నం సెంటర్ అయిన డిఎస్ఎన్ఎల్‌యూలో జరిగిన పరీక్ష కేంద్రాన్ని ఆచార్య సూర్య ప్రకాశరావు సందర్శించి పరీక్ష ఏర్పాట్ల గురించి విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కర్నూల్, రాజమండ్రి తదితర ఐదు సెంటర్లలో ఈ పరీక్ష జరిగిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరీక్షకు 1100 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. విశాఖపట్నం సెంటర్ అయిన డిఎస్ఎన్ఎల్‌యూలో 250 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు.

ప్రజలను నయవంచన చేసిన చంద్రబాబు

ప్రజాశక్తి-చోడవరం : అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని పదేపదే ఎన్నికల ముందు వాగ్దానాలు చేసిన చంద్రబాబు నయవంచనతో ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ప్రభుత్వ విప్, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మండిపడ్డారు. ఆదివారం చోడవరం వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ ఇప్పటికే రెండుసార్లు ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో ప్రజలపై రూ.15,485 కోట్లు ప్రజలకు తెలియకుండా భారాలు మోపారన్నారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబుకు సాటి ఎవరే లేరన్నారు. ఆయన విచ్చన సూపర్ సిక్స్ హామీలకు తూట్లు పొడిచారన్నారు. ఆరు మాసాల్లోనే బాబు పాలనపై ప్రజలు విసిగెత్తిపోతున్నారని తెలిపారు. మరోపక్క కాల్ మనీ గ్యాంగ్‌లు పట్టణాల్లో, గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో అధిక వడ్డీలకు ప్రజలు బలైపోతున్నారని, వారి జీవితాలు అస్తవ్యస్తంగా మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలంతా బాబు పాలన నిశితంగా పరిశీలిస్తున్నారని, జగన్ పాలనను మెచ్చుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజలను మోసం చేసి బురిడీ కొట్టించే పనులు చేస్తే ప్రజల ఆగ్రహానికి గురికాకు తప్పదని ధర్మశ్రీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

శిథిలమైన సామాజిక భవనం

ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్న గ్రామస్తులు



స్లాబ్, గచ్చు పెచ్చులూడి శిథిలమైన నేతవానిపాలెం సామాజిక భవనం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండల కేంద్రం శివారు నేతవానిపాలెం గ్రామంలో సామాజిక భవనం శిథిలావస్థకు చేరింది. కొన్నేళ్లుగా వినియోగంలో లేకపోవడంతో కూలిపోయేందుకు సిద్ధంగా వుంది. భవనం పై కప్పు, గోడలు, స్థంబాలు యొక్క పెచ్చులూడి బయటికి ఇనుపు చూవ్వలు కనపడుతున్నాయి. 30 సంవత్సరాలు క్రితం నిర్మించి ఉంటారని అంచనా. 5 సంవత్సరాలు నుంచి ఈ భవనం వినియోగంలో లేదు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరి అతి ప్రమాదకరంగా మారింది. తుపాన్ తాకిడికి భారీ వర్షాల నేపథ్యంలో ఈ భవనం ఏ పరిస్థితులలో నైనా కూలిపోయే ప్రమాదం వుందని గ్రామస్తులు వాపోతున్నారు.

ఈ భవనం శిథిలావస్థలో ఉన్నప్పటికీ కొంత మంది బట్టలు, కూరగాయలు వ్యాపారం అక్కడే చేస్తున్నారు. భవనానికి పక్కన ఉన్న కార్పొటెంటర్లు తమ ముడి సరుకును ఇక్కడ పెడుతున్నారు. స్థానిక రామాలయం పక్కనే ఈ భవనం ఉండడంతో పిల్లలు తరచుగా ఇక్కడ ఆటలు ఆడటంతో ప్రమాదం జరిగే అవకాశం వుందని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో యాదవ సంఘం, మేస్త్రి సంఘం, డ్వాక్రా సంఘ సమావేశాలు, పండుగ వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోడానికి భవనం లేక కొన్ని ఏళ్ల నుంచి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ భవనాన్ని త్వరితగతిన తొలగించాలని, కొత్త భవనం నిర్మించాలని గ్రామ పెద్దలు, ప్రజలు కోరుతున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు హామీలను అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-రాంబిల్లి

భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్రంలో టిడిపి కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శ్రీదుర్గాంబిక భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు ఎస్ రాంబాబు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దేవుడు నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక భవన నిర్మాణ కార్మికులు ఆదుకుంటామని చెప్పి ఆరు నెలలు కావస్తున్నా నేటికీ పెండింగ్ క్లైములు ఇవ్వలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు వివాహ సమయంలో లక్ష రూపాయలు సహాయం, వారి భార్యలు మొదటి, రెండవ కాన్పులకు రూ.20వేలు చొప్పున సహకారం, పిల్లలకు స్కాలర్ షిప్‌లు, నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షలు బీమా, అంగవైకల్యం ఏర్పడితే రూ.2.50 లక్షలు పరిహారం వంటి ఏ సమస్యను పరిష్కారం చేయలేదని పేర్కొన్నారు. నిర్మాణ కార్మికులకు ఎవరికి పరిహారం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక పూర్తిస్థాయిలో సరఫరా లేక పనులు దొరకటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ చందక రామకృష్ణ, మత్స్యకార సంఘం నాయకులు ధోని కాసియా, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



ప్రణవ్ గోపాల్‌కు మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న సురేంద్ర

విఎంఆర్‌డిఎ చైర్మన్‌ను కలిసిన సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఆదివారం విశాఖపట్నం విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్న వయసులోనే విశాఖ వుడా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందించి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి 83వ డివిజన్ టిడిపి ఇంచార్జ్ బొద్దపు ప్రసాద్, అనకాపల్లి 82వ డివిజన్ టిడిపి ఇంచార్జ్ పోలారపు త్రినాథ్, ఆకుల నానాజీ, వేగి కృష్ణ, బిటి కుమార్, షేక్ అలీ, ఎస్. భానుచందర్ (అఖి), జొన్నాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్లకు సత్కారం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మునగపాక, తిమ్మరాజుపేట గ్రామాలకు చెందిన రాష్ట్ర గవర, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణంను స్థానిక టిడిపి నాయకులు వారి నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉలింగల గోవింద, బొధపు రామా నాయుడు, గొన్నాబత్తుల అచ్యుతరావు, చెక్క అప్పారావు, టి ఈశ్వరరావు, భీముని జగదీశ్వరరావు, కారు వీరాస్వామి పాల్గొన్నారు.



డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

పాత పద్ధతిలోనే కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి

గిరిజన తెగల వారికి పాద పద్ధతిలోనే కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలకు పంచనామా తప్పనిసరి అంటూ రెవెన్యూ అధికారులు నిబంధనలు పెట్టడంతో ప్రజలు రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన తెగల్లో ఇప్పటి వరకు కొండదొర, మన్నెదొర, వాల్మీకి, మూగదొర, నూకదొరతో పాటు కొన్ని తేగలకు మాత్రమే గ్రామపెద్దలు, సర్పంచ్‌లు సంతకాలతో కూడిన దరఖాస్తులు చేస్తే తహశీల్దార్ కార్యాలయం నుండి ఆర్‌డిఓకు సిఫార్సు చేస్తే కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యేవని తెలిపారు. అయితే ప్రస్తుత నిబంధనలు ప్రకారం ఏ కులానికి చెందిన వారైనా పంచనామా పెట్టి సర్పంచ్‌తో సహా ఐదుగురు పెద్దలు సంతకాలతో పాటు, అదే ఇంటి పేరుతో పాత కుల ధ్రువీకరణ పత్రం పెడితే తప్ప సచివాలయంలో దరఖాస్తు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. దీని వల్ల కుల ధ్రువీకరణ పత్రాలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అదునుగా కొంతమంది సర్పంచ్‌లు, అధికార పార్టీ పెద్దలు ప్రజలను తమ ఇంటి చుట్టూ తిప్పుకుంటూ తమకు నచ్చిన వారికి సంతకాలు పెట్టి, నచ్చని వారిపై బెదిరింపులు పూనుకుంటున్నారని విమర్శించారు. అందువల్ల జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పాత పద్ధతిలో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఇఫ్కో (సమగ్ర రైతు సహకర సంస్థ) ఆధ్వర్యంలో మైక్రో లెండింగ్‌లో భాగంగా రామన్నపాలెం గ్రామంలో ఆదివారం మహిళలకు అనకాపల్లి జిల్లా డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం వెంకట్ చేతుల మీదుగా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 56 వేల మహిళ బృందాలకు స్వయం ఉపాధి కల్పించామన్నారు. వివిధ రకాల వస్తువుల ఉత్పత్తికి కావలసిన శిక్షణ కల్పించి పరిశ్రమల స్థాపనకు పూర్తిగా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కుమార్ స్వామి, మండల ఎగ్జిక్యూటివ్ లక్ష్మి, సరస్వతి మహిళలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-కశింకోట

కశింకోటలో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సర్వసభ్య సమావేశం ఆదివారం కశింకోటలో జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలల బకాయి వేతనాలు ఉండగా, ప్రస్తుతం రెండు నెలలు వేతనాలు వేస్తామని పంచాయితీ కార్యదర్శి రామ చంద్రరావు చెప్పారని తెలిపారు. గత నెలలో చనిపోయిన పంచాయతీ కార్మికుడు రవ్వ అప్పారావుకు పంచాయతీ ఆఫీస్ నుండి రూ.5వేలు మట్టి ఖర్చులకు ఇస్తామని చెప్పారని పేర్కొన్నారు. చనిపోయిన కార్మికుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునే నిమిత్తం కార్మికుని భార్యకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. పంచాయతీ కార్మికులకు జీతాలు పెండింగ్ ఉండటం వలన వడ్డీలకు అప్పులు తెచ్చి బాకీలు తీర్చలేక ఆర్థికంగా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెల సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొండబాబు, దేవుడు, రామాజీ, కుమార్, సన్యాసమ్మ, రమేష్, అబ్బులు, పంచాయితీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్మికులు

నేటి విశాఖ డెయిరీ ముట్టడిని జయప్రదం చేయండి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి-కశింకోట

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవుపాలు సేకరణ ధరను తక్షణమే పెంచాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం, ఎపి పాల రైతుల సంఘం ఆధ్వర్యాన ఈ నెల 2న జరుగు విశాఖ డెయిరీ ముట్టడికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని తాళ్లపాలెం, బయ్యవరం, జోగారావుపేట, నర్సింగపల్లి, తేగాడ తదితర గ్రామాలలో పాల రైతులతో ఆదివారం ఆయన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 29వ తేదీన విశాఖ డెయిరీ వద్ద జరిగిన ధర్నా సందర్భంగా డెయిరీ జిఎంతో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాల రైతుల కష్టంతో అభివృద్ధి చెందిన విశాఖ డెయిరీకి వేల కోట్ల ఆస్తులతో పాటు మార్కెట్లో మంచి బ్రాండ్ ఇమేజ్ వచ్చిందని చెప్పారు. ఆ అభివృద్ధి ఫలాలు పాడి రైతులకు దక్కకుండా దారిమళ్లిస్తూ భారాలు మాత్రం రైతులపై వేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో కృష్ణా జిల్లాలో ఉన్న సహకార డెయిరీ ఆవుపాలకు రూ.1.50, గేదె పాలకు రూ.2 ధర పెంచిందని, విశాఖ డెయిరీలో రైతులకు రూ.250 కోట్లు షేర్ క్యాపిటల్ ఉన్నప్పటికీ డివిడెంట్లు రైతులకు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. విశాఖ డెయిరీ అవినీతిపై వివిధ పత్రికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీని 1964 సహకార చట్టం పరిధిలోకి తీసుకురావాలని, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి బోనస్ ఇవ్వాలని, పాల సేకరణ ధర పెంచాలని కోరుతూ సోమవారం ఉదయం 10 గంటలకు విశాఖ డెయిరీ కేంద్ర కార్యాలయం ముట్టడికి పాల రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల రైతుల సంఘం మండల నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు డిడి. వరలక్ష్మి, జి.ప్రసాద్, వెంకటరమణ, ఏ.రమణ, టి.రాజు, జి. నాగేషు, టి.దయానంద్, పాల రైతులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న పాడి రైతులు, రైతు నేత కర్రి అప్పారావు

వర్షంతో నేల కొరిగిన వరి వంట



నక్కపల్లి మండలంలో తుపాన్‌కు నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి-నక్కపల్లి

వరి పంట చేతికందే సమయంలో తుఫాన్ రైతులను ఆందోళనకు గురి చేసింది. తుఫాన్ కారణంగా రెండు రోజుల నుంచి కురిసిన మోస్తారు వర్షానికి, ఈదురు గాలులకు పలు గ్రామాల్లో వరి పంట నేల కొరిగింది. మండలంలోని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మునుపెన్నుడు లేని విధంగా 4,400 ఎకరాల్లో రైతులు వరి సాగు చేసారు. వరి నాట్లు ఆరంభంలో వర్షం కోసం రైతులు ఇబ్బందులు పడినప్పటికీ, అప్పుడప్పుడు కురిసిన వర్షాలు వరికి ఊపిరి నిచ్చాయి. గతంలో లేని విధంగా ఈ ఏడాది వరి సాగు ఆశాజనకంగా ఉంది. మండలంలోని ఉపమాక, జానకయ్యపేట, నక్కపల్లి, చినదొడ్డిగల్లు, కాగిత, ఉద్దండపురం, గొడిచెర్ల, ఒడ్డి మెట్ట, డొంకాడ, జి జగన్నాధపురం, ముకుంద రాజుపేట తదితర గ్రామాల్లో వరి కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో తుఫాను ప్రభావంతో కురిసిన వర్షం, ఈదురుగాలులకు అక్కడక్కడా వరి చేను నేల కొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, ఈ సమయంలో వర్షం కురిస్తే తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చయ్యపేట : తుపాన్ వల్ల ఆదివారం కూడా మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో వరి రైతుల ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వడ్డాది, చిన్నప్పన్నపాలెం, పోలేపల్లి, దిబ్బిడి, బుచ్చయ్యపేట తదితర గ్రామాల్లో కొంతమంది రైతులు వరి కోతలు కోశారు. మరి కొంతమంది వరి పంటను కోయకుండా పొలాల్లోనే విడిచిపెట్టారు. కోసిన పంట తడిసి పోగా, అది మొక్కలు వస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో కోయకుండా విడిచిపెట్టిన పంట నేలకొరిగింది. పలు గ్రామాల్లో చెరుకు పంట సైతం నేలకొరిగింది. దీంతో వరి చెరకు రైతులు ఆందోళనలో చెందుతున్నారు.

కశింకోట : ఫెంగల్ తుఫాన్ కారణంగా మండలంలోని గ్రామాల్లో పండిన వరి చేను నేలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోత సమయంలో తుఫాన్ ప్రభావంతో పడిన వర్షం పంటకు తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రభుత్వం న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రేపు వికలాంగులకు బస్ పాసుల శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని వడ్డాది జంక్షన్ వద్ద ఉన్న విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం వద్ద అనకాపల్లి ఆర్టిసి డిపో మేనేజర్ ఆదేశాలతో ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ సౌజన్యంతో వికలాంగులకు రాయితీతో కూడిన బస్సు పాసులు మంజూరుకు ఈ నెల 3న శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఆకుల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శిబిరానికి బుచ్చెయ్యపేటతో పాటు మాడుగుల, చోడవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న వికలాంగులు హాజరు కావచ్చన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. శిబిరానికి హాజరయ్యే వారు సదరం ధ్రువపత్రం, ఆధార్ కార్డు నకలు, ఒక పాస్ ఫోటోలతో పాటు రూ.100 రుసుము చెల్లించాలని కోరారు. మూగ, అంధులు, ఈఎన్టి వారికీ వంద శాతం ఉండాలన్నారు. వడ్డాది టిడిపి యూత్ ఆధ్వర్యంలో భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇతర వివరాలకు ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆకుల నాగేశ్వరరావు 9959459879, సుంకర శ్రీనివాసరావు 9652597088 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో విశ్వబ్రాహ్మణ వీధిలో గల శ్రీవీరబ్రహ్మం గారి ఆలయం వద్ద ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి బ్రహ్మంగారి ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు తీర్చుకొని తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి భజనలు, చిడతలు, తప్పుడు గుళ్ళు, వాయిద్యాలు మధ్య బ్రహ్మంగారిని ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు ఈర్ల అప్పారావు, విశ్వబ్రాహ్మణులు గ్రామ ప్రజలు పెద్దలు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని వెంకటాపురం గ్రామంలో నీల కంటేశ్వర స్వామి ఆలయంలో నెల రోజులపాటు జరిగిన అన్న సమారాధన ఆదివారం ఘనంగా ముగిసింది. ప్రతి ఏటా కార్తిక మాసంలో గ్రామ సర్పంచ్ సుందరపు నీలకంఠ స్వామి (తాతాజీ) ఆధ్వర్యంలో నెలరోజుల పాటు అన్న సమారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముగింపు కార్యక్రమంలో నాయకులు బద్దం సర్యనారాయణ, ద్వారపరెడ్డి పరమేష్, సుందరపు కనక అప్పారావు, బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాసరావు, బద్దం ప్రతాప్, బుద్ధరాజు మాధవ వర్మ, పండూరి కనక అప్పారావు, ఆళ్ల సూరిబాబు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

అనకాపల్లి : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు బకాయి, బీమా పరిహారాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు వైఎన్.భద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ బోర్డును నిలిపివేయడం వలన సుమారు 40 వేల డెత్ క్లైములు, ఆడపిల్లల వివాహ ఖర్చులు, కాన్పు ఖర్చుల కింద ఇచ్చే పరిహారాలు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు మహాలక్ష్మి నాయుడు, ఎం కాశప్పారావు, అరిగా అప్పలకొండ, పీలా వెంకట్రావు, చెల్లూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చుక్కలనంటిన కూరగాయల ధరలు

పెరిగిన వంటనూనె, పప్పుల ధరలు



ప్రజాశక్తి -బుచ్చయ్యపేట,

కూరగాయలు, నూనె, పప్పుల ధరలు చుక్కలనంటాయి. కూరగాయల ధరలు దిగి రాకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత రెండు మూడు నెలల నుండి పెరిగిన ధరలే తగ్గడం లేదు. ఆదివారం వడ్డాదిలోని వారపు సంతలో టమాటా కిలో రూ.50, ఉల్లి రూ.60, బెండ, వంకాయ, బంగాళా దుంపలు, బీరకాయలు, చిక్కుడు కాయలు ఇలా అన్ని రకాల కూరగాయలు ధరలు కిలో రూ.60, చొప్పున అమ్ముతున్నారు. పిక్కలు కేజీ రూ.200, పావు కేజీ అల్లం రూ.30, కొత్తిమీర కట్ట రూ.30 విక్రయించారు. ప్రతిరోజు వంటింట్లో ఉపయోగించే టమాటా, ఉల్లి ధరలు దిగి రాకపోవడం వినియోగదారులకు ఆందోళన కలిగిస్తుంది. కొద్ది నెలలుగా వర్షాలు కురిసినా ఎండలు కాసినా ధరలు మాత్రం అదే విధంగా కొనసాగుతున్నాయి. మరోపక్క మార్కెట్లో వంటనూనె ధరలు, కందిపప్పు ధరలు భారీగా పెరిగిపోయాయి.

కొద్దిగా తగ్గిన చికెన్ ధర

చికెన్ ధర గతంలో కిలో రూ 220 నుండి రూ 240 వరకు ధర ఉండేది. అయితే ప్రతి ఏడాది కార్తీక మాసంలో చికెన్ వినియోగం తక్కువగా ఉండటంతో 100, 120 రూపాయల వరకు ధర వచ్చేది. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు రెండు రోజులు క్రితం వరకు కిలో చికెన్ 220 రూపాయలు వరకు అమ్మకాలు చేశారు. ఆదివారం కిలో చికెన్‌లో మార్కెట్లో 180 రూపాయలు అమ్మకాలు చేశారు. చికెన్ ధర కాస్త తగ్గడంతో మాంసం ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో రహదారులు అస్తవ్యస్తం



కోటవురట్లలో జగనన్న కాలనీ వద్ద బురదగా రోడ్డు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో పెట్రోల్ బంకు సమీపంలో జగనన్న కాలనీ వాసులు ఇంటికి వెళ్లే దారి సక్రమంగా లేక అవస్థలు పడుతున్నారు. శనివారం ఉదయం కురిసిన వర్షానికి కాలనీలో దారులన్ని జలమయమయ్యాయి. మండలంలోని అతిపెద్ద కాలనీ ఏర్పాటు చేసిన నాటి ప్రభుత్వం మౌలిక వస్తువుల కల్పనపై దృష్టి సారించకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పగలే ఇలా ఉంటే రాత్రి సమయంలో ఇళ్లకు చేరేది ఎలా అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులు వచ్చి వెళ్తున్నారని సమస్యను పరిష్కరించ లేదని వాపోయారు. కూటమి ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోలుగుంట:వర్షంతో రోలుగుంట మెయిన్ రోడ్డు దారుణంగా తయారైంది. అసలే ఈ రోడ్డు గోతులు పడి అధ్వాన్నంగా ఉంటుంది. దీనికి తోడు రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి గోతుల్లో నీరు చేరడమే కాకుండా బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయడానికి హడలిపోతున్నారు. త్వరితగతిన ఈ రోడ్డు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

రావికమతం: ఎన్ని ప్రభుత్వాలు మారినా,, ఎంత మంది పాలకులు వచ్చినా చోడవరం నుంచి రోలుగుంట వరకు ఆర్ అండ్ బీర్ రోడ్డు పరిస్థితి రూపురేఖలు మారలేదు. ఈ రోడ్డు గుండా ప్రయాణం చేస్తున్న వాహనచోధకులు, బైకిస్టులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు ఎప్పటికీ పూర్తవుతుందా అని వెయ్యి కళ్లతో ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసే ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. ఈ రోడ్డుపైన గొయ్యలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితుల్లో బైకిస్టులు ప్రమాదాలకు గురవుతున్నారు.



రోలుగుంటలో రోడ్డు గోతిలో నిలిచిన నీరు



రావికమతంలో గోతిలో చేరిన వర్షపు నీరు

చోడవరం నుంచి రోలుగుంట మధ్యలో అటు వడ్డాది, విజయరామరాజుపేట బ్రిడ్జిలు గత ప్రభుత్వ హయాంలోనే కుప్ప కూలి పోయాయి. తాత్కాలిక ఉపశమనాన్ని కల్పించి చేతులు దులుపుకుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తరువాతనైనా పనులు ప్రారంభమవుతాయని అంతా భావించినా నేటికీ పనులు ప్రారంభం కాకపోవడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చినుకు పడితే చాలు గొయ్యిలన్నీ వర్షపు నీటితో నిండి చిత్తడి చిత్తడిగా మారి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల మేడివాడ గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభమైనప్పటికీ అవి కూడా నత్తనడకన సాగు తున్నాయని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ప్రారంభించని అంగన్‌వాడీ కేంద్రం

ప్రారంభానికి నోచని అంగన్వాడీ కేంద్రాలు

ప్రజాశక్తి- కోటవురట్ల:మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్మించిన అంగన్వాడి కేంద్రం పూర్తయి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. అదేవిధంగా సినిమా హాలు సెంటర్ సమీపంలో నిర్మించిన మరో అంగన్వాడి సెంటర్ కూడా దాదాపు పూర్తి కావచ్చినా ప్రారంభించ లేదు. దీంతో, అంగన్వాడీ కేంద్ర నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ రెండు కేంద్రాలు కూడా అద్దె కొంపలో కొనసాగుతున్నాయి. ఒక్కో కేంద్రానికి దాదాపు పది లక్షల రూపాయలు ఖర్చు చేసి గత ప్రభుత్వాలు నిర్మించిన భవనాలు వృథాగా పడి ఉండడం పట్ల పలు విమర్శలు గుప్పిస్తున్నారు.

మహా ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి ముంచింగి పుట్టు :ఈనెల 4న పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహా ధర్నాకు ఆదివాసి గిరిజనులు ఏకమై విజయవంతం చేయాలని సిపిఎం నేత, మండల వైస్ ఎంపిపి 1 పాటుబోయి సత్యనారాయణ, ఎంఎం శ్రీనులు కోరారు. మండలంలోని కించాయిపుట్ గ్రామపంచాయతీ పరిధిలోని గడ్డి బంధం, దారాపల్లి, సిరగంపుట్టు వరకు గుమ్మి గ్రామాలలో ఆదివారం పోస్టర్లు ఆవిష్కరించారు.

పలుచోట్ల ఎయిడ్స్ డే ర్యాలీలు



అనకాపల్లిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎం అండ్ హెచ్ఓ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు సుకన్య, శ్రావణి ఎయిడ్స్ వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గంగా భవాని, లక్ష్మణమూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఐసిటిఎస్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి మెడికల్ ఆఫీసర్ కనకలక్ష్మి, కౌన్సిలర్ కృష్ణంరాజు, సిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల:అంతర్జాతీయ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, బీసీ హాస్టల్ విద్యార్థులతో మాడుగుల గ్రామంలో ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఎల్.శ్రీనివాస్, కే.సంతోష్ కుమార్, ఐసిటిసి అధికారి వి.శ్రీనివాసరావు, ఎల్టి ఎం.గోవిందా, ఎస్టిడిఎస్ ఎం.కుమారి, హాస్టల్ వార్డెన్ ఎం.దేవి, వైద్య సిబ్బంది నరేంద్ర, శ్రీలత, భవాని పాల్గొన్నారు.


రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన నేకో సివిల్‌డబ్ల్యూ గణేష్ సారధ్యంలో వైద్యాధికారులు ఆర్.సునీత, ఎస్.శ్రీశీనివాస్‌రాజుల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఫీల్డ్ అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మందులతో ఎయిడ్స్‌ను నివారించవచ్చు

అనకాపల్లి:సక్రమంగా చికిత్స తీసుకొని, మందులు వాడితే ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు కూడా సంపూర్ణ జీవితాన్ని పొందవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఎంఎస్‌వికె.బాలాజీ అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం ఎన్టీఆర్ వైద్యాలయం నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా చిన్న పిల్లల అత్యవసర చికిత్స భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు విజయకుమార్, ఏఆర్‌టి ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ హేమ, బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారి డాక్టర్ కనకదుర్గ, సివిఎస్ఓ స్పందన, వ్యాధి గ్రస్తులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం పిహెచ్‌సి ఆవరణలో వైద్యాధికారి మానస, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్, వైద్య సిబ్బంది ఇందిరా గణేష్, ముకేష్, లక్ష్మి పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అయ్యన్న జూనియర్, డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాసీం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవగాహనతో ఎయిడ్స్ వ్యాధిని అంతం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సీమునురి రమణ, గాడి



మాడుగులలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది

సబ్బవరం : స్థానిక ఐసిటిసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ర్యాలీని పీహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ సిహెచ్.ఆశ ప్రారంభించారు. పిహెచ్‌సి నుండి మూడు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ వరకు గురుకుల పాఠశాల విద్యార్థులచే హెచ్‌ఐవికి వ్యతిరేకంగా నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఐసిటిసి కౌన్సిలర్ రాజశేఖర్, వైద్య సిబ్బంది కె.స్వర్ణలత, కె.జేసుదాసు, రత్నబాబు, నీలిమ, శివ, రాంబాబు, కళాశాల డాక్టర్ కన్నమనాయుడు, జానకిరామ్, లక్ష్మణరావు, పద్మావతి పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ ఎం.రత్నం ప్రకాష్, అధ్యాపకులు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, డాక్టర్ వివి.గోపాలకృష్ణ, డాక్టర్ బి.శంకర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

భీమునిపట్నం : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక సిహెచ్‌సి, ఐసిటిసి ఆధ్వర్యంలో ఆసుపత్రి నుంచి గంటస్తంభం మీదుగా బస్‌స్టాండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని డాక్టర్ ఎం.ఫణికుమార్ ప్రారంభించారు. బస్‌స్టాండ్‌లో మానవహారం నిర్మించి, ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ రావి వెంకటరాజు, స్థానిక హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి సత్యనారాయణ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది రామారావు, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

తగరపువలసలో...

ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, విశాఖ ఎఆర్‌టి, ఐసిటిసి విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌డే సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్ కళాశాల వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఆసుపత్రి నుంచి సంగివలస వరకు నిర్వహించిన ర్యాలీలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ కెవి చక్రధర్, వైద్యసిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు

పద్మనాభం: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఎస్ఒఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా రేవిడి, వెంకటాపురం, కురపల్లి, కోరాడ గ్రామాల్లో మహిళా సంఘాలు, విద్యార్థులతో



భీమిలిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

అవగాహన ర్యాలీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఒఎస్ సిబ్బంది కె.దుర్గరాజు, యానిమేటర్లు సిహెచ్ జానకి. పి మణి, ఆదిలక్ష్మి, కె సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వేతర సంస్థలు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి మెడికల్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ వద్ద మానవహారం ఏర్పాటుచేశారు. నినాదాలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధ్ర ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఎల్ఎస్ఎ ఎంవి.శేషమ్మ, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఎఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులు 80 ఏళ్లు జీవించొచ్చు : కూటికుప్పల

క్రమశిక్షణతో మందులను వాడుతూ ఎయిడ్స్ రోగులు కూడా 80 ఏళ్లు జీవించవచ్చని డాక్టర్ కూటి కుప్పల సూర్యారావు స్పష్టం చేశారు. ఎయిడ్స్ డే సందర్భంగా హైలీ యాక్టివ్ యాంటీ రిట్రోవైరల్ థెరపీ సదస్సును కంచరపాలెంలోని డాక్టర్ కూటికుప్పల హాస్పిటల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1981లో ఎయిడ్స్ తాకిడికి అమెరికా విలవిల లాడి పోయిందన్నారు. 2024 నాటికి ఎయిడ్స్ ఒక దీర్ఘకాలిక వ్యాధిగా మారిందని తెలిపారు. ఎయిడ్స్ సోకిందని తెలియగానే 72 గంటల లోపు పోస్టు ఎక్స్‌పోజర్ ప్రొఫలాక్సిస్ మందులు వాడి ఎలా నెగిటివ్ చేసుకోవచ్చో ఆయన వివరించారు. రోజూ రూ.30 ఖరీదు చేసే ఒక్క మాత్ర క్రమం తప్పకుండా వేసుకొని క్రమశిక్షణతో జీవితం గడిపితే ఎయిడ్స్ రోగులు 80 ఏండ్ల వరకు జీవిస్తున్నారని గుర్తు చేశారు.



కోతకు గురైన ఇసుక

కోతకు గురైన తీర ప్రాంతం

ప్రజాశక్తి -నక్కపల్లి:తుఫాన్ ప్రభావం కారణంగా తీర ప్రాంతాల్లో అలజడి నెలకొంది. మత్స్యకార గ్రామాలైన రాజయ్యపేట, దొండవాక, బోయపాడు, బంగారమ్మ పేట తదితర తీర ప్రాంతాలు సముద్రపు అలలకు కోతకు గురయ్యాయి. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లలేదు. పడవలు, ఇంజన్లు, వలలను సముద్రపు బొడ్డుకు చేర్చి భద్రపరిచారు. తుఫాన్ కారణంగా సముద్రపు అలలు ఎగిసి పడుతున్నాయి.



మాట్లాడుతున్న బాధిత సంఘం సభ్యులు

కో ఆపరేటివ్ సొసైటీలో అవినీతిని బయట పెట్టాలి

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలో జానకిరాంపురం కోఆపరేటివ్ సొసైటీలో ఉన్న అవినీతిని బయట పెట్టాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం కుసర్లపూడి సచివాలయ కేంద్రంలో సంఘం సభ్యులు కిల్లాడ సాంబమూర్తి, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు, గొల్లు నారాయణరావు తదితరులు విలేకర్లతో మాట్లాడుతూ, మండలంలో ఏడు పంచాయతీ గ్రామాలు ఉన్నాయని, 6వేల మంది సభ్యులు ఉన్నారన్నారు. వారిలో 500 మంది రుణం పొందారన్నారు. 5 కోట్ల టర్నోవర్ అవుతుందని, వీటిలో 1కోటి 50లక్షల నష్టాలతో ఉందన్నారు. సుమారు 250 బినామీల పేరున సొసైటీ అధికారులు రుణం పొందారన్నారు. సొసైటీ కార్యదర్శి, నర్సీపట్నం డిసిసిబి బ్యాంక్ సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకు అధికారులపై జిల్లా కలెక్టర్, విశాఖ డిసిసిబి బ్యాంక్ సిఈఒకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సభ్యులకు న్యాయం జరగలేదన్నారు. అవినీతిపై విచారణ చేయాలన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయం

ప్రజాశక్తి -రోలుగుంట:విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, యూనిట్‌కు రూ.92పైసల చొప్పున వసూలు చేయాలనే నిర్ణయం దారుణమన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలపై కోట్లాది రూపాయల భారం పడుతుందన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూమి ప్రభుత్వం తీరా ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమన్నారు.

మాడుగుల :కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు తగ్గించి ప్రజలపై భారాన్ని వెయ్యమని ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ తుంగలో తొక్కిందని మాడుగుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పడాల కొండలరావు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అధిక విద్యుత్ చార్జీలు పెంచి కూటమి ప్రభుత్వం సామాన్యులపై భారం వేస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ప్రభుత్వ తరహాలో పాలన చేయడం మంచిది కాదన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేయడం సరికాదన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు

- అసంపూర్తిగా నిలిచిన భవనాలు -ఇరుకు గదులు, రేకుల షెడ్లలో నిర్వహణ

ప్రజాశక్తి -కొత్తకోట: అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. సొంత భవనాలు లేక ఇరుకు గదులు, రేకుల షెడ్లు, సామాజిక భవనాలలో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల్లో కనీస సదు పాయాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో పలు గ్రామాల్లో నిర్మాణ పనులు ప్రారంభించిన అంగన్వాడీ భవనాలు నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయా యి. మరికొన్ని గ్రామాల్లో స్థలం కేటాయిం చక సొంత భవనాలు సమకూరలేదు...

రావికమతం ఐ సి డి ఎస్ పరిధిలో రావికమతం తో పాటు బుచ్చెయ్యపేట, చోడవరం, రోలుగుంట మండలాలు ఉన్నాయి..ఈ మండలాల్లో సుమారు 294 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా అందులో 134 సొంత భవనాలు కలిగి ఉన్నాయి. 107 కేంద్రాలు అద్దె భవనాలలో నడుస్తుండగా మరో 53 అద్దె లేని అంటే సామాజిక భవనాలు, రేకుల షెడ్డు లు పూరి పాకలలో నడుస్తున్నాయి...వీటికి సొంత భవనాలు ఏర్పాట్లు చేయాలన్న సంకల్పంతో పలు గ్రామాలలో కొత్త భవనాల నిర్మాణం చేపట్టారు. అయితే మధ్యలో నిధుల లేమి కారణంగా పనులు నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణలకు నిధులు కేటాయిస్తే పూర్తి కావచ్చునని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ధర్మవరంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రం



కొత్తధర్మవరంలో అసంపూర్తిగా నిలిచిన భవనం

ఈ ఐసిడిఎస్ పరిధిలో సున్నా నుంచి ఆరు నెలల లోపు చిన్నారులు 1244 మంది ఉండగా ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు 6,350 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 5,435 మంది ఉన్నారు. గర్భిణీలు 1207 మంది ఉండగా, బాలింతలు 1339 మంది నవంబర్ నెలకి నమోదు అయి ఉన్నారు. చోడవరం మండలం గాంధీ గ్రామం పంచాయతీ పరిధి లో మూడు అంగన్వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీ గా ఉండగా బుచ్చెయ్యపేట మండలం కరక, చిన భీమవరం లలో రెండు హెల్పర్ పోస్టులు, పెదపూడి లో ఒక టీచర్ పోస్టు భర్తీ కావాల్సివుంది. రావికమతం మండలం లో మర్రివలస, గొల్లల పాలెం రెండు హెల్పర్ పోస్టులు, కుందానిపేటలో టీచర్ పోస్టు ఖాళీ కాగా, రోలుగుంట మండలం వడ్డిపలో ఒక టీచర్ పోస్టును భర్తీ చేయాల్సి ఉంది.

ఐసిడిఎస్ పరిధిలో మధ్యలో నిలిచిన అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం పూర్తికి ఆయా మండలాల్లో మండల అభివృద్ధి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎంపిడిఒలను కోరామని రావికమతం ఐసిడిఎస్ సిడిపిఒ ఉషారాణి తెలిపారు.



పాతధర్మవరంలో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణం

మానసిక వైద్యంలో నూతన పోకడలు

మానసిక వైద్యుల సదస్సులో డాక్టర్ బుచ్చిరాజు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మానసిక వైద్యంలో వస్తున్న నూతన పోకడలు శాస్త్రజ్ఞులను అమితంగా ఆకర్షిస్తున్నాయని, భవిష్యత్తులో మెదడు, నాడీ వ్యవస్థల విజ్ఞానం మానసిక వ్యాధుల పరిష్కారంలో కీలక భూమిక వహించవచ్చని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. భారత మానసిక వైద్యుల ఆంధ్ర రాష్ట్ర విభాగం 13వ పీజీ నిరంతర విద్యా సదస్సు గాయత్రి వైద్య కళాశాల ఆధ్వర్యాన అంకోసా ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మానసిక వైద్యానికి ప్రాముఖ్యత పెరిగిందన్నారు. 270 మంది వైద్య విద్యార్థులు, 50 మంది నిపుణులు హాజరైన ఈ సదస్సును విశ్రాంత డిఎమ్ఇ డాక్టర్ ఎస్.సుబ్బారావు ప్రారంభించి మాట్లాడుతూ, ప్రజలలో ఉన్న అపోహలు తొలగించడానికి ఇటువంటి సదస్సులు దోహదం చేస్తాయన్నారు. ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి మాట్లాడుతూ, వైద్య విద్యార్థులు మానసిక వైద్యాన్ని ఐచ్ఛికంగా అభ్యసించేందుకు ముందుకు రావడం ముదావహం అన్నారు. భారత మానసిక వైద్య సంఘం ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జివిఎస్.మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో, వివిధ రాష్ట్రాల నిపుణుల ప్రసంగాలు, వృత్తి అవకాశాలపై చర్చా వేదికలు నిర్వహించారు. ఈ సదస్సుకు కార్య నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్.రాజు, కార్యదర్శి డాక్టర్ నిహాల్ ప్రముఖ మానసిక వైద్యులు ఇంద్ర రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: భారతీయ సాంప్రదాయ సంస్కృతి పరిరక్షణ మానవతా విలువలు పరిరక్షణ ధ్యేయంగా సఫద ప్రతిభా పరీక్షలు నిర్వహించడం జరుగిందని సుఫద ప్రాంతీయ అధ్యక్షులు వైవి రమణ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో ఆయన మాట్లాడుతూ సుఫద సేవా సంస్థ వ్యవస్థాపకులు యువిఎన్ రాజు మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమాన్ని రెండు దశాబ్దాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలకు 300కు పైగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ తలుపులు మాట్లాడుతూ, విద్యార్థుల్లో మాతృభాషపై మక్కువ పెంచే ఇటువంటి కార్యక్రమాలు జరపడం మంచిదని అభినందించారు.



హాజరైన విద్యార్థులు

కబడ్డీని ప్రోత్సహిస్తాం

-మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : గ్రామీణ క్రీడ కబడ్డీని ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, క్రీడాకారులకు విద్య, ఉపాధిలో గతంలో ఉన్న రెండు శాతం రిజర్వేషన్లను మూడు శాతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. కబడ్డీని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ముందుకు తీసుకెళ్లడానికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. ఖేలో ఇండియా, ఆసియన్ గేమ్స్, ఒలింపిక్స్ తదితర క్రీడా పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించి బహుమతులు అందజేస్తుందని తెలిపారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుతం నిరాదరణకు గురవుతున్న కబడ్డీ క్రీడకు పూర్వ వైభవం తేవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్‌గా పల్లా శ్రీనివాస్, గౌరవాధ్యక్షులుగా కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమావేశంలో ప్రకటించారు. అనంతరం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం కబడ్డీ అసోసియేషన్ల అధ్యక్షులు ఎ.చిరంజీవి, ఆర్.నాగేశ్వరరావు, పి.గోపి తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వి.వీరలంఖయ్య, కార్యదర్శి బాల పద్మ, కార్యనిర్వాహక కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పలువురు కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.